క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించండి



గుడివాడ టౌన్ : స్థానిక కంకిపాడు రోడ్డులోని బేతవోలు ఇందిరానగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిందని, పురపాలక సంఘ పరిధిలో పన్ను చెల్లిస్తున్నామన్నారు. కాని అక్కడ కనీస మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. దీనిపై స్పందించి ప్రత్యేక అధికారిగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు ఎండీ తెహర్‌బాషా, ఎండీ ఆఫీజ్ ఉన్నీసా, కరిమె ఉన్నీసా, ఎం. పద్మ, జి. గౌరి, ఆదిలక్ష్మి, ఆదినారాయణ, పార్వతి పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థులు



గుడివాడ టౌన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి టీంకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం జి.పద్మావతి మంగళవారం తెలిపారు. ఈ నెల 13వ తేదీన విజయవాడ స్టెల్లా కళాశాల్లో జరిగిన అండర్-19 విభాగంలో తమ విద్యార్థి ఎ. శివ, ఈ నెల 6వ తేదీన నూజివీడులో జరిగిన అండర్-17 విభాగంలో జి. రాకేష్ వీరమాధవ్, అండర్-14 బాలికల విభాగంలో జైబున్నీసాలు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు జి. శ్రీనివాసరావు, ఎం.సత్యాన్వేష్‌ను ఆమె అభినందించారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

బాణసంచా అక్రమ నిల్వలపై నిఘా పెట్టాలి



కైకలూరు: దీపావళి సందర్భంగా బాణసంచా అక్రమ నిల్వలపై గ్రామాల్లో మహిళా పోలీసులు నిఘా పెట్టాలని కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ సూచించారు. కైకలూరు సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గ నాలుగు మండలాల మహిళా పోలీసులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో దీపావళి సందర్భంగా ఎవరైనా మందు గుండు సామగ్రి నిల్వలు, అనుమతులు లేని దుకాణాల వంటి సమాచారాన్ని మహిళా పోలీసులు ముందుగానే గుర్తించాలన్నారు. మందుగుండు సామగ్రి దుకాణాల వద్ద నిబంధనలు కచ్చితంగా పాటించే విధంగా దుకాణదారుల్లో అవగాహన కలిగించాలన్నారు.

రోగులు, వృద్ధులకు సాయం



కైకలూరు: రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలగాని నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. కైకలూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, కైకలూరు ఎస్టీ కాలనీలో పేదలు, అంగన్‌వాడీ చిన్నారులు, తామరకొల్లు మదర్‌థెరిసా వృద్ధులకు పండ్లు, భోజనాలు అందించారు.

శ్లాబు పెచ్చులూడుతున్న భవనం

ఆందోళనలో ఉపాధ్యాయులు

మండవల్లి: మండవల్లి ఎంఈఓ కార్యాలయంలోని సమావేశ మందిరం శ్లాబ్ పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడుతోంది. సమావేశం జరుగుతున్నప్పుడు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నుంచి ఇలాగే ఉన్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలున్నాయి. కార్యాలయం చుట్టూ వర్షం నీరు నిలిచిపోతోంది. సుమారు వారం రోజుల నుంచి కార్యాలయం చుట్టూ వర్షం నీరు నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు ఎంఈఓ కార్యాలయాన్ని అభివృద్ధి చేసి సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ఎంఈఓ కార్యాలయంలో సమావేశ మందిరంలో పెచ్చులూడి పడిన శ్లాబ్

సమావేశ మందిరాన్ని అభివృద్ధి చేయాలి

ఎంఈఓ కార్యాలయ సమావేశ మందిరానికి శ్లాబ్ వేసి అభివృద్ధి చేయాలి. శ్లాబ్ దెబ్బతిని పెచ్చులూడటంతో పెచ్చులను కింద గుట్టగా పోశారు. అధికారులు శ్లాబ్‌కు మరమ్మతులు చేయించేందుకు తగిన చర్యలు చేపట్టాలి.

– పి.సూర్యనారాయణ, మండవల్లి

ఎప్పుడు ఏం జరుగుతుందో?

సమావేశ మందిరంలో శ్లాబ్ దెబ్బతిని పెచ్చులూడటంతో సమావేశాలు జరిగే సమయంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా శ్లాబ్‌ను సరిచేసి సమావేశ మందిరాన్ని అభివృద్ధి చేయాలి.

– ఎం.ఆదాం, మండవల్లి

సూర్యచంద్రరావుకు ఘన నివాళి

కైకలూరు: అనారోగ్యంతో మృతిచెందిన పలువురు పార్థీవదేహాలకు మంగళవారం వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నివాళులర్పించారు. మండవల్లి మండలం లోకుమూడికి చెందిన ప్రముఖ దళిత నాయకుడు మత్తె సూర్యచంద్రరావు(78) అనారోగ్య కారణాలతో విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించారు. లోకుమూడిలో ఆయన మృతదేహానికి డీఎన్నార్ నివాళులర్పించారు. కలిదిండిలో ప్రముఖ బీసీ నేత గొరిపర్తి సుబ్బారావు వయసు పైబడిన సమస్యలతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి డీఎన్నార్ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము, పార్టీ నాయకులు పంజా రామారావు, పంజా నాగు, ఆకునూరి జాన్సన్, మత్తే పాపారావు, ఉండ్రమట్ల ఏసు కుమార్, కూరెళ్ల జయపాల్, మత్తే అశోక్, కన్నా బాబు, వడుపు రామారావు, నిలపాల వెంకటేశ్వరరావు, ఆళ్ల రాము, నిలపాల సుబ్బయ్య, కరేటి రాంబాబు, నున్న భగవానులు, పోతురాజు లక్ష్మన్న, ఉండ్రమట్ల ఏసుకుమార్ పాల్గొన్నారు.



మత్తే సూర్యచంద్రరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీఎన్నార్

కౌలు రైతులకే రాయితీ ఇవ్వాలి

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వం అందించే రాయితీలు కౌలు రైతులకే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, జిల్లా కమిటీ సభ్యులు చిన్నం మాధవ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నట్లు విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని వాస్తవంగా పంటలు పండించే కౌలు రైతులకే వర్తింపజేయాలని కోరారు. అదేవిధంగా పంట రుణాలు, పెట్టుబడి సాయం, పంటనష్టపరిహారం ఈక్రాప్ పంటల బీమా వంటి సౌకర్యాలను కౌలు రైతులకు కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు జక్కుల మహేష్, కౌలు రైతుల సంఘం నాయకులు అనగాని శ్రీరామమూర్తి, రాజులపాటి ఏడుకొండలు, పల్లి రంగారావు, బొంతు రంగారావు, మహేష్, నగులు, సురేష్, అప్పారావు, శ్రీనివాసరావు, రామారావు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చేపల చెరువులు తవ్వారని ధర్నా

ముదినేపల్లి రూరల్: అనుమతులు లేకుండా కాలనీకి ఆనుకుని చేపల చెరువులు తవ్వి కొంపలు ముంచారంటూ మండలంలోని చేవూరు వైఎస్సార్ కాలనీ వాసులు వడ్లమన్నాడు-సింగరాయపాలెం ఆర్అండ్‌బీ రహదారిపై మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ కాలనీవాసులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బడాబాబులు ఆరు నెలల కిందట కాలనీలోని నివాసాలకు ఆనుకుని అనుమతులు లేకుండా 30 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వారన్నారు. ఆ సమయంలో అభ్యంతరం చెప్పినప్పటికీ లెక్కచేయకుండా పోలీసు బలగాలతో తమను భయపెట్టి చెరువులు తవ్వినట్లు తెలిపారు. ముంపు సమస్య లేకుండా డ్రెయిన్ తవ్వి మురుగు, వర్షపునీరు నిల్వకుండా చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తవ్వకాలు పూర్తయిన తరువాత హామీని నెరవేర్చకపోవడంతో చెరువుల్లోని ఊటనీరు, వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక కాలనీ మునిగిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తహసీల్దార్ గ్రామానికి రావాలని నిరసన తెలియజేశారు. దీంతో స్థానిక పోలీసులు ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామంటూ తెలిపారు. తక్షణమే ముంపు సమస్యను పరిష్కరించాలంటూ దళితులు పట్టుబట్టారు. స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పీఏ గ్రామ సర్పంచ్‌కు ఫోన్ చేసి బుధవారం తహసీల్దార్ వచ్చి సమస్యను పరిష్కరిస్తారని ఎమ్మెల్యే తెలిపారని చెప్పడంతో సర్పంచ్ ఈ సమాచారాన్ని ఆందోళనకారులకు తెలపడంతో ధర్నా విరమించారు.



చేవూరు రహదారిపై ధర్నా చేస్తున్న దళితులు

శిథిలావస్థలో నెప్రోలి వంతెన



కూలేందుకు సిద్ధంగా ఉన్న నెప్రోలి వంతెన

నందివాడ: స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద ఉన్నటువంటి నెప్రోలి వంతెన శిథిలావస్థకు చేరింది. అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కొంత కాలంగా ఈ వంతెన కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. ప్రమాదమని తెలిసినా తప్పక ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వాహనదారులు, రైతులు చెబుతున్నారు. ఈ వంతెన పై నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. అయితే ఈ వంతెన ఎప్పుడు కూలుతుందేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెన మరమ్మతులకు గురవడం ఇది మూడోసారి రహదారి మధ్యలో వంతెన శిథిలమై పెచ్చులూడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. ఎప్పుడు కూలుతుందోనని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు అంచనాలు వేస్తున్నామని వంతెనలు నిర్మిస్తామని అధికారులు చెబుతున్నా కార్యరూపం దాల్చలేదని ఆరోపిస్తున్నారు. ఈ వంతెనపై నుంచి సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రజలు గుడివాడ వెళుతుంటారు.

భయంతోనే పొలాలకు..

నెప్రోలి వంతెనపై నుంచి భయంతోనే పొలాలకు వెళ్లి, వస్తున్నామని రైతులు చెబుతున్నారు. ట్రాక్టర్లపై పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు చాలా ఇబ్బందిగా ఉంటోందని ఆవేదన వక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ అభివృద్ధి పనులు ప్రారంభం

మండవల్లి: మండవల్లిలో సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో కైకలూరు వీధిలో డ్రెయినేజీ అభివృద్ధి పనులను మంగళవారం నిర్వహించారు. ఈ రహదారిలో డ్రెయినేజీ సక్రమంగా లేకపోకవడంతో వర్షం నీటికి ముంపునకు గురైంది. నీరు తగ్గడంతో డ్రెయినేజీ పనులను ప్రారంభించారు.

రేపు ప్రజాభిప్రాయ సేకరణ

గుడివాడ టౌన్ : గుడివాడ పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్ రూపకల్పన, విజన్ డాక్యుమెంట్ తయారీలో భాగంగా ఈనెల 16వ తేదీ ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాల్లో ఏపీసీఆర్డీఏ, ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఈ ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అభిప్రాయ సేకరణలో మేధావులు, అనుభవం కలవారు తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సేవలు

గుడివాడ టౌన్ : పట్టణ ప్రజలకు ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా వసతులు మెరుగుపర్చాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. మ్యాన్‌హోల్స్ వలన ప్రజలకు ఇబ్బంది కలుగకూడదన్నారు. అదేవిధంగా డ్రెయిన్లలో సిల్టు ఎప్పటికప్పుడే తొలగించి క్లీన్ చేయాలన్నారు. ప్రతి ప్రాంతంలోను వీధి దీపాలు వెలిగేలా చూడాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. సిబ్బంది అలసత్వం వలన ప్రజలు ఇబ్బంది పడకూడదని పేర్కొన్నారు.

ఆలయాల జీర్ణోద్ధరణకు రూ.15వేల విరాళం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులకు మంగళవారం చావా వెంకటేశ్వరరావు(కొండలు) రూ.15,232వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి పాల్గొన్నారు.


వాహనం ఢీకొని దివ్యాంగురాలికి గాయాలు

ముదినేపల్లి రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో దివ్యాంగురాలు తీవ్రంగా గాయపడింది. మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లికి చెందిన దివ్యాంగురాలు మద్దాల నాగమణి మంగళవారం రాత్రి కొత్తపల్లి సెంటర్లోని కిరాణా షాపునకు వెళుతుండగా బంటుమిల్లి నుంచి సింగరాయపాలెం వైపు వెళుతున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వేగంగా వస్తూ ఢీకొట్టింది. వాహనదారుడు పరారయ్యాడు. నాగమణి ఎడమ మోకాలు విరిగింది. బంధువులు చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జీఎస్టీపై అవగాహన

కైకలూరు: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అనేక సేవలు సులభతరమవుతోన్నాయన్నారు. ప్రధానంగా నిర్మాణరంగంపై ఈ ప్రభావం కనిపిస్తోందన్నారు. సిమెంట్‌పై 18 శాతం , మార్బుల్, గ్రావెల్, ఇసుక, సున్నం, ఇటుకలపై 5 శాతం, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, ఫ్రేములు, ఫ్యాన్లు 12 శాతం ధరలు తగ్గాయని పేర్కొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అడవి కృష్ణ

కైకలూరు: మండల పరిషత్ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ తనను కూడా ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు ఆహ్వానించడం లేదని ఎంపీపీ అడవి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మీటింగ్ హాల్లో జరిగింది. వరహాపట్నం ఎంపీటీసీ సభ్యుడు పందు గాంధీ ప్రసాద్ ప్రొటోకాల్ ప్రకారం తనను ఆహ్వానించడం లేదని సభ దృష్టికి తీసుకురావడంతో తనను కూడా అధికారులు కొన్ని పర్యాయాలు పిలవడం లేదని సమాధానం చెప్పారు. మీటింగ్‌కు రాని ప్రభుత్వ శాఖల అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ రాజబాబును ఆదేశించారు. వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ మాట్లాడుతూ కైకలూరులో మత్స్యశాఖ ప్రభుత్వ ల్యాబ్‌లో రైతులకు టెస్టులు చేయడం లేదన్నారు. డీసీ చైర్మన్ వాసురాజు మాట్లాడుతూ కైకలూరు పంట కాల్వలో బాగు చేస్తున్నప్పటికీ చెత్త మూటలు విడిచిపెడుతున్నారన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధి సాధించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయండి

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

జుఝువరం(పామర్రు): నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని జుఝువరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 66 ఇళ్ల మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో 56 నిర్మాణం చేపట్టగా వీటిలో 33 పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. నిర్మాణానికి కావాల్సిన స్టీలు, సిమెంట్, ఇటుక తదితర సౌకర్యాలను లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందించాలన్నారు. త్వరితగతిన ఇళ్లు పూర్తయ్యేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, గృహ నిర్మాణ శాఖ ఈఈ బుచ్చిబాబు, ఏఈ పవన్, పామర్రు తహసీల్దార్ జి.రవికాంత్, ఎంపీడీఓ కె.జ్యోతి, ఇంజినీరింగ్ సహాయకులు భవాని, సర్వేయర్ లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.



జుఝువరంలో ఇళ్ల సముదాయాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి

ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్ : దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని బాణసంచా అమ్మకాలు, రవాణా తదితర అంశాలపై నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాణసంచా సామగ్రి రిటైల్ వ్యాపారులు అధికారులు సూచించిన స్థలంలో మాత్రమే షాపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు తాత్కాలిక బాణసంచా లైసెన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు షాపుల యజమానులు చిన్నపిల్లలను పనుల్లో పెట్టుకోరాదన్నారు. అమ్మకాలపై 18 శాంత జీఎస్టీ విధిగా చెల్లించాలన్నారు.అగ్నిమాపక శాఖ వారు నిబంధనల మేరకు షాపుల వద్ద ఇసుక, నీరు, అగ్నిప్రమాద నివారణ సామగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా ఉప అధికారి జి.ఆంజనేయులు, డీఎస్పీ ధీరజ్ వినీల్, ఏడు మండలాల తహసీల్దార్‌లు, జీఎస్టీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పామర్రు: ఆల్ ఇండియా మవేట్-కా-షిటో రాయ్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ఏఎన్ఎం హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎన్ఎం హైస్కూల్లో విజేతలను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన చెన్నైలో జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారన్నారు. అండర్-12 బాలుర, బాలికల విభాగాల్లో డి.భువన శ్రీజ, డి.ఝాన్సీలక్ష్మీ ద్వితీయ స్థానం సాధించి వెండి పతకాలను సాధించారని తెలిపారు. అదేవిధంగా ఎం.గోడశ్రీప్రియ, మణికంఠ, వి.హర్షిత, కె.మురారీ తృతీయస్థానం సాధించి కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులతోపాటు వారికి శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ వీవీఎస్ రామకృష్ణను ప్రిన్సిపాల్ అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

అస్తవ్యస్తంగా మండవల్లి రహదారి



ప్రమాదభరితంగా మారిన రహదారి



అస్తవ్యస్తంగా ఎంఈఓ కార్యాలయ రహదారి

మండవల్లి: మండవల్లి మెయిన్ రోడ్డు వద్ద వర్షం నీటి కారణంగా రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఈ రోడ్డుపై పాదచారులు, వాహనదారులు నానా యాతన పడుతున్నారు. ఎక్కడ గుంత ఉందో తెలియక గుంతలో పడిపోతున్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయానికి వెళ్లే రహదారి వర్షం నీటితో ముంపునకు గురైంది. కార్యాలయం లోనికి వెళ్లేందుకు సిమెంట్ రాళ్లు వేశారు. దీనిపై కాలు వేసి వెళ్లేటప్పుడు కాలు జారి ఎక్కడ పడతామోనని ఆందోళనతో చెందుతున్నారు.

కౌలురైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

కంకిపాడు: కౌలురైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వి.భావనారాయణను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా హరిబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు తక్షణమే కౌలురైతులకు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నూతన కౌలు చట్టం తెస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే హామీని విస్మరించి కౌలురైతుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పి కౌలురైతులను పట్టించుకోవటం లేదన్నారు. 16 నెలల పాలనలో కౌలురైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. వాస్తవ సాగుదారులకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జె.రవి, వి.మరియదాసు, టి.నరేష్, సీహెచ్ శ్రీహరి, బి.దీపిక, బి.ప్రియాంక, ఎం.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

కైకలూరు: అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులను గమనించిన వెంటనే డయల్ 112 లేదా దగ్గర పోలీసు స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని కైకలూరు టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, ఆలయాలు, లాడ్జిలు, సినిమా థియేటర్ల వద్ద డాగ్ స్క్వాడ్ విస్తృత భద్రతా తనిఖీలు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను మాట్లాడుతూ ప్రజల భద్రతను బలోపేతం చేయడం, నేరాలను ముందస్తుగా అరికట్టడం లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు చేస్తున్నామన్నారు. అనంతరం మసీదు సెంటర్, బస్టాండ్ సెంటర్లో ఆటోల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందన్న ఆరోపణలపై స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.